# చరిత్ర ప్రసిద్ధి.. రాజకీయ చైతన్యం

నియోజకవర్గ సత్తెనపల్లి ముఖచిత్రం

## సత్తెనపల్లిలో సత్తా చాటినవారిదే రాష్ట్రంలో అధికారం

- నాలుగు సార్లు గెలుపొందిన స్వాతంత్ర్య యోధుడు వావిలాల
- ఉద్యమాలకు పట్టుగొమ్మ
- ఏపీ 9వ ముఖ్యమంత్రిగా ముప్పాళ్ళ వాసి భవనం వెంకట్రామిరెడ్డి



సత్తెనపల్లి ఏరియల్ వ్యూ



సత్తెనపల్లిలోని గడియార స్థంభం

**సత్తెనపల్లి:** పల్లవులు, విష్ణుకుండిలు, కాకతీయులు పరిపాలించిన రాజ్యంలో కొంత భాగమే సత్తెనపల్లి ప్రాంతమని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1707-1712 మధ్య కాలంలో మానూరు, వాసిరెడ్డి సంస్థానల కింద పరిపాలన సాగింది. 1777లో వీరి మధ్య జరిగిన ప్రాంతాల విభజనతో సత్తెనపల్లి మానూరి వారి జమానా కిందకు వచ్చింది. నాడు సత్యన్న అనే వడ్డెర నాయకుడి పేరు మీద కొన్ని గృహాలు ఇక్కడ నిర్మించారు. అతని పేరు మీద కాలక్రమేణ సత్తెనపల్లిగా స్థిరపడిపోయింది. 1713లో నాటి మహమ్మదీయ ప్రభువు సత్తెనపల్లి ప్రాంతాన్ని రాజా మానూరి వెంకట్రావుకు ఈనాం ఇవ్వగా, 1779కి పూర్వం ప్రస్తుతం గాంధీ చౌక్ సమీపంలోని పాత సూర్య థియేటర్ ప్రదేశంలో కోట నిర్మించి, సత్తెనపల్లి ప్రాంతాన్ని పరిపాలించారు. పట్టణంలోని ప్రధాన రహదారి అచ్చంపేట వెళ్లే మలుపులో 12 అడుగుల ఎత్తుగల ఉక్కు స్తంభాన్ని ఏర్పాటు చేసి, దానికి ఐదు లాంతర్లు అమర్చారు. ఆ లాంతర్ల ఆధారంగానే గుంటూరు వైపు, మాచర్ల వైపు, మాదిపాడు వైపు, నరసరావుపేట వైపు వెళ్లే బాటసారులకు వెలుగునిచ్చేది. అప్పట్లో కాలం తెలుసుకునేందుకు ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ఈ గడియార స్తంభాన్ని చూసుకుని బాటసారులు తమ ప్రాంతాలకు వెళ్లేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం సత్తెనపల్లి గ్రామ పంచాయతీగా సుమారు నాలుగు దశాబ్దాలపాటు సేవలు అందించింది. జానాభివృద్ధితో 1984 మార్చి 2న సత్తెనపల్లిని పురపాలకంగా మార్చారు. 1987 మార్చి 30 నుంచి పురపాలన అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం గ్రేడ్-2 మున్సిపాల్టీగా 31 వార్డులుగా విస్తరించింది.



చేజర్లలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత శ్రీ కపోతేశ్వర స్వామి ఆలయం

### నియోజకవర్గ స్వరూపం

సత్తెనపల్లి నియోజకవర్గం గతంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలతో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలు తాడికొండ నియోజకవర్గంలో కలిశాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో ఉన్న రాజుపాలెం, నరసరావుపేటలో ఉన్న నకరికల్లు మండలం సత్తెనపల్లి నియోజకవర్గంలో కలిశాయి. ప్రస్తుతం సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గానికి దక్షిణాన నరసరావుపేట, ఉత్తారన పెదకూరపాడు, పడమర గురజాల, తూర్పున తాడికొండ నియోజకవర్గాలు సరిహద్దులుగా ఉన్నాయి.

### అవార్డులు....


సత్తెనపల్లి మున్సిపాల్టీకి 2022లో స్వచ్ఛ సర్వేక్షణ్ సౌత్ ఇండియా స్థాయి 47వ ర్యాంక్ వచ్చింది. 2023లో 21వ ర్యాంక్ వచ్చింది.

- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకి 2020 నవజాత శిశువులు, పిల్లలకు సంబంధించి ముస్కాన్, 2023 లక్ష్య గర్భిణులు, లేబర్ రూమ్ ఆపరేషన్ థియేటర్ జాతీయ నాణ్యత ప్రమాణాల సూచి అర్హత పత్రం లభించాయి.
- ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 2023లో జాతీయ నాణ్యతా ప్రమాణాల



నర్సింగపాడులోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వస్వామి దేవాలయం

### సత్తెనపల్లి సమాచారం....



| | |
|---|---|
| సచివాలయాలు -60 | వైద్య విధాన పరిషత్ |
| ఆర్బీకేలు-50 | ఏరియా వైద్యశాల-1 |
| విలేజ్ హెల్త్ క్లినిక్‌లు-48 | వెటర్నరీ డిస్పెన్సరీస్-13 |
| పట్టణ ఆరోగ్య కేంద్రాలు- 3 | గ్రామీణ పశు వైద్యశాలలు-20 |
| అగ్రిటెస్టింగ్ ల్యాబ్-1 | నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఒకటి ఉంది. |
| పీహెచ్‌సీలు-5 | భౌగోళిక విస్తీర్ణం -712 చదరపు కిలోమీటర్లు |
| ప్రాంతీయ పశు వైద్యశాలలు-3 | |

### ఓటర్ల వివరాలు

సత్తెనపల్లి నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లు **2,42,047**

నియోజకవర్గం జనాభా **2,86,000**

పురుషులు **1,18,400** | స్త్రీలు **1,23,635**




### రాజకీయపోరు..


- సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజలు ఎప్పుడూ ఒక పార్టీకే పట్టం కట్టలేదు. వామ పక్షాలు, స్వతంత్ర అభ్యర్థులూ గెలుపొందారు. మొదటిసారిగా 1952లో అసెంబ్లీ ఎన్నికలతో సహా ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా 1952, 1955, 1962, 1967లో స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాల కృష్ణయ్య ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి సీపీఐ, మూడు సార్లు స్వతంత్ర అభ్యర్థిగా ఆయన విజయం సాధించారు.
- 1972లో కాంగ్రెస్ అభ్యర్థి గాదె వీరాంజనేయశర్మ చేతిలో స్వతంత్ర అభ్యర్థిగా వావిలాల 797ఓట్లతో ఓటమి పాలయ్యారు.
- 1978లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థి డాక్టర్ రావెల వెంకట్రావు సీపీఎం అభ్యర్థి పుతుంబాక వెంకటపతిపై 9,369 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 1983లో టీడీపీ అభ్యర్థి నన్నపనేని రాజకుమారి కాంగ్రెస్ అభ్యర్థి చేబ్రోలు హనుమయ్యపై 19,668 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- 1985లో సీపీఎం అభ్యర్థి పుతుంబాక వెంకటపతి.. కాంగ్రెస్ అభ్యర్థి జేవీ పద్మలతపై 9,351 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- 1989లో కాంగ్రెస్ అభ్యర్థి దొడ్డా బాలకోటిరెడ్డి.. సీపీఎం అభ్యర్థి పుతుంబాక వెంకటపతిపై 13,928 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 1994లో సీపీఎం అభ్యర్థి పుతుంబాక భారతి.. కాంగ్రెస్ అభ్యర్థి రాయపాటి శ్రీనివాస్‌పై 2,337 ఓట్ల మెజార్టీ సాధించారు.
- 1999లో టీడీపీ అభ్యర్థి వైవీ ఆంజనేయులు.. కాంగ్రెస్ అభ్యర్థి చేబ్రోలు హనుమయ్యపై 10,693 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2004లో కాంగ్రెస్ అభ్యర్థి యర్రం వెంకటేశ్వరరెడ్డి.. టీడీపీ అభ్యర్థి డాక్టర్ కె.అంజిరెడ్డిపై 24,410 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో ఈ మెజార్టీ అత్యధికం. 2009లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేగా యర్రం వెంకటేశ్వర రెడ్డి రెండోసారి విజయం సాధించారు.
- 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబుపై డాక్టర్ కోడెల శివప్రసాదరావు టీడీపీ నుంచి కేవలం 924 ఓట్ల మెజారీతో గెలుపొందారు.
- 2019 ఎన్నికల్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావుపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు 20,876 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.



భవనం వెంకట్రామ్



వావిలాల గోపాలకృష్ణయ్య



పుతుంబాక వెంకటపతి



అంబటి రాంబాబు

### నియోజకవర్గ ప్రత్యేకతలు....

- రాజకీయంగా చైతన్యం కలిగిన ప్రాంతం. ప్రజా ఉద్యమాలకు నిలయంగ. హేతువాద, రాడికల్ ఉద్యమాలకు పట్టుగొమ్మ. కమ్యునిస్టుల ప్రభావం ఎక్కువ.
- సాగర్ కుడి కాలువ కింద వరి పంట సాగవుతోంది. నాగార్జున సాగర్ ఆనకట్ట నిర్మాణం కోసం 1950 ప్రాంతంలో 40 వేల మందితో సత్తెనపల్లిలో భారీ ఎత్తున జనసమీకరణ జరిగింది. ఆనకట్ట నిర్మాణం చేపట్టాలనే ఉద్యమానికి ఈ సమీకరణ ఊతమిచ్చింది.
- 1952-53లో నందికొండ ప్రాజెక్టు నిర్మాణానికి రైతు ఉద్యమం ఇక్కడి నుంచే మొదలైంది. అప్పట్లో ఆల్ ఇండియా నాయకత్వం సత్తెనపల్లి వచ్చింది.
- 1952లో నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థి మద్దతుగా నిలిచే పార్టీనే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ వచ్చింది.
- ముప్పాళ్ళకు చెందిన భవనం వెంకట్రామ్ ఆంధ్రప్రదేశ్ 9వ ముఖ్యమంత్రిగా 1982 ఫిబ్రవరి 24 నుంచి సెప్టెంబర్ 20 వరకు ఏడు నెలలు పాటు పని చేశారు.
- నియోజకవర్గం సాంస్కృతిక రంగానికి పెద్దపీట వేసింది. ఇక్కడ కళా పరిషతుల ద్వారా వేలాది నాటకాలు ప్రదర్శించారు. వర్ణ, ప్రకృతి చిత్రాలు, ఇకనోగ్రఫీ (దేవతామూర్తి) చిత్రాలు, భావోద్వేగ ఘట్టాలతో ఆలోచింపజేసే చిత్రాల సృష్టి కర్త జింక రామారావు సత్తెనపల్లి వాసే.
- రాష్ట్రంలోనే పేరుగాంచిన ఫణిదం చేనేత సహకార సంఘం ఇక్కడే నెలకొల్పారు. ప్రస్తుతం పత్తి ఆధారిత నాలుగు జిన్నింగ్, రెండు స్పిన్నింగ్ మిల్లుల్లో 2 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.
- నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత శ్రీ కపోతేశ్వరస్వామి ఆలయం శిబి చక్రవర్తి కాలం నాటిదిగా చరిత్ర ప్రసిద్ధి. ఇంద్రుడు - శిబి చక్రవర్తి మధ్య జరిగిన ఘట్టం చేజర్లలో జరిగినట్లు చరిత్ర. ఈ ఆలయం గోపురం ఏనుగు ప్రష్టాకారంలో ఉండడం ప్రత్యేకత.
- నకరికల్లు మండలం నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం 3వ శతాబ్దం నాటిది.
- రాజుపాలెం మండలం దేవరంపాడు నేతి వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధి చెందినది. పల్నాడు తిరుమలగా భావించి ఇక్కడ పూజలు చేస్తారు.
- ముప్పాళ్ళకు చెందిన సినీ హాస్యనటుడు కన్నెగంటి బ్రహ్మ నందం, వడ్లవల్లికి చెందిన సినీ నటి బృందావనం చౌదరి, ఆమె కుమార్తె హేమా చౌదరి కూడా సినీనటి. సత్తెనపల్లికి చెందిన సింగర్ నాగుర్‌బాబు(మనో).
- పెదకూరపాడు, నరసరావుపేట, పిడుగురాళ్లకు మధ్యలో సత్తెనపల్లి ఉండటంతో వస్త్ర, బంగారు వ్యాపారాలకు వాణిజ్య పరంగా పేరుగాంచింది
- రెండు ఇంజనీరింగ్, బీ-ఫార్మసీ కళాశాలలు అందుబాటులో ఉండటంతో విద్యా కేంద్రంగా విరాజిల్లుతోంది.

## క్లుప్తంగా

### మజ్జిగ పంపిణీ

**సత్తెనపల్లి:** పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ సమీపంలో ఆర్య వైశ్య నాయకుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి శుక్రవారం బాటసారులకు మజ్జిగ అందించారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ లోక కళ్యాణి, లోక మాధవ, రెడ్డిగూడెం కరీముల్లా తదితరులున్నారు.

### 7న మాదల మహంకాళి తిరునాళ్ళ

**మాదల(ముప్పాళ్ళ):** మాదల శ్రీమహంకాళి అమ్మవారి 44వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం ఈ నెల ఏడో తేదీన జరగనుంది. తిరునాళ్ళ ను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఆలయావరణలో చలువ పందిళ్ళు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం నిమిత్తం బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏటా శ్రీరామ నవమి అనంతరం తిరునాళ్ళ నిర్వహించటం ఇక్కడి ఆనవాయితీ.

### పెయింటర్‌కు తీవ్ర గాయాలు

**సత్తెనపల్లి:** సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రగాయాల పాలయ్యాడు. కొత్తగా నిర్మాణంలో ఉన్న అదనపు భవనానికి రంగులు వేస్తుండగా ఒడిశాకి చెందిన కె.ప్రేమ్ అనే యువకుడు ప్రమాదవశాత్తు మూడంతస్తులపై నుంచి జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యోగాలో అచ్చంపేట విద్యార్థికి స్వర్ణం



**అచ్చంపేట :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి రాయిడి అజయ్ యోగాసనాలలో స్వర్ణం సాధించాడు. అండర్ 17 జాతీయ పోటీలలో అజయ్ ఈ ఘనత సాధించాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆలపాటి సుజాత తెలిపారు. కొత్త ఢిల్లీలో ఏప్రిల్ 27 నుంచి 30వరకు పోటీలు జరిగాయన్నారు.

## మేలు చేసిన వారికే పట్టం కట్టండి

- ఇచ్చిన హామీని చంద్రబాబు ఏనాడైనా నిలబెట్టుకున్నారా ?
- ఆలోచించండంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన మంత్రి అంబటి రాంబాబు
- నందిగామ, గుడిపూడి గ్రామాలలో ఎన్నికల ప్రచారం



గుడిపూడిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

**సత్తెనపల్లి** ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ప్రతి ఇంటికి మేలు చేసిన జగన్‌మోహన్ రెడ్డికే మళ్లీ పట్టం కట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం గుడిపూడి, నందిగామ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. . మహిళలు ఎదురేగి హారతులు ఇచ్చారు.ప్రచార రథంపై ప్రధాన వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేయడం ద్వారా రాష్ట్రంలో సరికొత్త సంక్షేమ విప్లవాన్ని జగనన్న తీసుకువచ్చారన్నారు. ఈ 58 నెలల్లో నందిగం 1, 2 సచివాలయాల పరిధిలో సంక్షేమ, అభివద్ధికి రూ 58,67,04,442 లను ప్రభుత్వం అందించిందని వివరించారు. ఈ సంక్షేమాభివద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి జగనన్నను గెలిపిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. రాయపాటి పురుషోత్తమరావు, కట్టా సాంబయ్య తదితరులున్నారు.

## ఐక్యంగా పనిచేద్దాం.. పార్టీని గెలిపిద్దాం

- కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నంబూరు
- అత్తలూరు, జూపూడిలో ఎన్నికల ప్రచారం



అత్తలూరులో ప్రచార వాహనంపై నుంచి ప్రసంగిస్తున్న నంబూరు శంకరరావు

**అమరావతి:** ఐక్యంగా పనిచేద్దాం ..వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం అంటూ పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు నంబూరు శంకరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలపరిధిలోని అత్తలూరు,జూపూడి గ్రామాలలో నిర్వహించిన ఇంటింటిప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు బూటకపు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. ప్రస్తుతం కుట్రలతో కూటమి కట్టిన మూడు పార్టీలకు బుద్ధి చెప్పాలంటే రాబోయే ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజల దీవెనలు ఎంతో అవసరమని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమం తరావు, గ్రామ సర్పంచ్ బంకా సరోజిని గ్రామ నాయకులు సింగంనేని నరసయ్య, రాయుడు హనుమంతరావు, సతీష్, మాదినేని హరిబాబు, ఎంపిటిసి దేవ కుమార్, నాగరాజు, పున్నారావు, అన్నపాములు, డేవిడ్, సుందరరావు, జక్రయ్య, పోతుగంటి కుమారి లతో పాటు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం

అంబటి విజయలక్ష్మి



25వ వార్డులో ఎన్నికల ప్రచారంలో అంబటి విజయలక్ష్మి

**సత్తెనపల్లి:** సమాజంలోని అన్ని వర్గాలకు సముచితం స్థానం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైందని, మహిళా సాధికారిత కూడా నినాదంలా కాకుండా విధానంలా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి అంబటి రాంబాబు సతీమణి విజయలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో ఇంటింట ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి తో కలిసి పర్యటించారు. ఇంటింటికి తిరిగుతూ మేనిఫెస్టో పత్రాలను అందించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గ అభ్యర్థిగా అంబటి రాంబాబును ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, గంగారపు అనూష, శిరిగిరి వెంకట్రావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు

సాదరంగా ఆహ్వానించిన మంత్రి అంబటి రాంబాబు



వైఎస్సార్ సీపీలో చేరిన కుంకలగుంట వాసులతో మంత్రి అంబటి రాంబాబు



ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి సమక్షంలో పార్టీలో చేరిన అచ్చంపేట టీడీపీ కార్యకర్తలు

**సత్తెనపల్లి:** సత్తెనపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి ఇతర పార్టీల నాయకుల చేరికలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా టీడీపీ , జనసేన నుంచి కీలక నేతలు ఆ పార్టీలను వీడుతున్నారు. శుక్రవారం బృగుబండ గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీ బాట పట్టారు. వారికి మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జనసేన తరఫున ఇనుకొల్లు సాంబశివరావు (శివ), బొజ్జా రామకృష్ణ ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి గంపల హరి, మేకల వెంకటరావు, బాడుగుల రాంబాబు, తోరటి నరసింహారావు, చట్టు.శివలున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహ మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నల్లబోతు శివనారాయణ, సర్పంచ్ గండు పద్మావతి, నాయకులు అన్నదాసు శ్రీనివాసరావు, ఇనుకొల్లు దేశిబాబు, దుగ్గి. రాంబాబు, గండు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీలోకి కుంకలగుంట**

**సత్తెనపల్లి:** నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన షేక్ చిన్న కాశయ్య, షేక్ వాసు, పాపిశెట్టిపాలెం నాలుగో వార్డు సభ్యులు షేక్ మస్తాన్‌వలీల శుక్రవారం వైఎస్సార్ సీపీ గూటికి చేరారు. మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో వీరంతా చేరారు. రెండు రోజుల కిందట కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. అయితే పశ్చాత్తాపానికి గురై తిరిగి వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, నకరికల్లు, సత్తెనపల్లి మండలాల పార్టీ నాయకులున్నారు.

**వైఎస్సార్ సీపీలోకి 40 కుటుంబాలు**

**అచ్చంపేట:** అచ్చంపేటకు చెందిన 40 కుటుంబాలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈమేరకు ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**కొండూరు బీసీలు**

కొండూరు గ్రామానికి చెందిన బీసీ యాదవ సోదరులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

**టీడీపీని వీడిన 30 కుటుంబాలు**

**బెల్లంకొండ:** మండలంలోని వన్నాయపాలెం, మాచాయపాలెం గ్రామానికి చెందిన 30 టీడీపీ కార్యకర్తల కుటుంబాలు వైఎస్సార్ సీపీ గూటికి చేరాయి. ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి సమక్షంలో శుక్రవారం పార్టీ బాటపట్టారు. అదే విధంగా మాచాయపాలేనికి చెందిన30 టీడీపీ కార్యకర్తల కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. చేరినవారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**వైఎస్సార్‌సీపీలోకి 10 టీడీపీ కుటుంబాలు**

**క్రోసూరు:** క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే తనయుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి చేరినవారికి కండువాకప్పి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని వారిని కోరారు.

## క్రోసూరు హోరెత్తింది.. జై జగన్ అంటూ నినదించింది

**పెదకూరపాడు, క్రోసూరు :** అదే ఉత్సాహం..అదే ఆదరణ శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సభతో క్రోసూరు జనసంద్రమైంది. ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి, ఎమ్మెల్యే తనయుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తిలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.జై జగన్ నినాదాలతో క్రోసూరు హోరెత్తింది. యువత ఉత్సాహంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు.

### చంద్రబాబుపై నమ్మకం లేదు



మహిళలకు ఐదేళ్లలో జగన్ ఎంతో న్యాయం చేశారు. ఆసరా,దీవెన,అమ్మ ఒడి, చేయూత ఇలా అన్ని పథకాలు మహిళలకే వేస్తున్నారు. ఇలాంటి మంచి వ్యక్తికి ఓటు వేస్తే మా భవిష్యత్ బాగుంటుంది. జగనన్నకే నా ఓటు. చంద్రబాబు నాయుడు చెప్పే మాటలపై నమ్మకం లేదు. గతంలో రుణమాఫీ అన్నాడు. ఇప్పుడేమో ఏకంగా లక్ష అంటున్నాడు. మేమేమైనా చిన్న పిల్లలమా ఆయన చెప్పేవన్నీ నమ్మడానికి. –ధనలక్ష్మి, మాదిపాడు